క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ చూపాలి


బొజ్జాయిగూడెంలో పనులను పరిశీలిస్తున్న డీఎల్పీఓ రాజ్‌కుమార్

ఇల్లెందురూరల్: పల్లెల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీఎల్పీఓ రాజీవ్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగింపు..


ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి ఎంజీరోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేసిన వాటిని బుధవారం మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది జేసీబీలతో తొలగించారు. మంగళవారం నుంచి ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టి గణేష్ టెంపుల్ రోడ్డులో.. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించారు.

విస్తృతంగా జీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలో జీఎస్ఆర్ టస్ట్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు చైర్మన్ గడల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు చేపట్టగా, త్వరలోనే గ్రామ కమిటీలు నియమిస్తామని పేర్కొన్నారు. ట్రస్టు సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమాతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇప్పించనున్నట్లు ఆయన తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు స్వీకరించిన టీబీజీకేఎస్ రీజియన్ కార్యదర్శి కూసన వీరభద్రయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. కొత్తగూడెంలోని పీవీకే-5 షాఫ్ట్ గని కార్మికుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి వీరభద్రయ్య కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాలడుగు శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, ఈశ్వరయ్య, చిలక రాజయ్య, కిశోర్, సతీశ్, కనకారావు, నాగార్జున పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన ఆటోడ్రైవర్ విజయ్‌కుమార్‌పాసీ అనారోగ్యంతో మృతి చెందారు. కొత్తకాలనీకి చెందిన శివశక్తి సారయ్య(సారిక) మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

కంటి వెలుగు ప్రారంభం


కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని బుధవారం చుంచుపల్లి మండలం బాబూ క్యాంప్‌లో ఎంపీపీ బాదావత్ శాంతి ఎంపీటీసీ కూసన వీరభద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావు, ఉప సర్పంచ్ శీను, డాక్టర్ సువర్ణ, ఏఎన్ఎం సుజాత, రాజా, నాగేంద్ర, ఆశవర్కర్లు పద్మ, వరలక్ష్మి, వాణిశ్రీ, మాలతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఇల్లెందు: పట్టణంలోని 5వ వార్డుకు చెందిన తేలుకుంట్ల నవీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే హరిప్రియ పరామర్శించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు ఎస్కే పాషా, యలమందల వాసు, గిన్నారపు రాజేశ్ పాల్గొన్నారు.

లైట్లు వెలుగుతాయా.. లేదా?

- జూలూరుపాడులో అసంపూర్తిగానే సెంట్రల్ లైటింగ్ పనులు
- ఏడాదైనా పూర్తి కాని సైడ్ డ్రెయినేజీల నిర్మాణం
- చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి చేరుతున్న నీరు



నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులు (ఇన్‌సెట్) డ్రెయినేజీ సరిగ్గా లేక రోడ్డు వెంట వర్షపు నీరు

జూలూరుపాడు: జూలూరుపాడులో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.5.22 కోట్లతో జూలూరుపాడులో తల్లాడ-భద్రాచలం రాష్ట్రీయ రహదారి వెంట సైడ్ డ్రెయినేజీల నిర్మాణం, డివైడర్‌ను గ్రిల్స్‌తో ఆధునికీకరించడం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, జూలూరుపాడు-చీపురుగూడెం బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గత ఏడాది ఏప్రిల్ 4న ఈ పనులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శంకుస్థాపన చేశారు. కానీ, ఏడాది దాటినా పనులు పూర్తికాకపోగా, డివైడర్ల ఆధునికీకరణ, సెంట్రల్ లైటింగ్ పనులు తొలి దశలో ఉన్నాయి.

ఆది నుంచి అవాంతరాలే..

జూలూరుపాడులో రాష్ట్రీయ రహదారి వెంట డ్రెయినేజీల నిర్మాణం చేపట్టగా ఇరువైపులా ఇళ్లకు నష్టం వాటిల్లుతోందని ప్రజలు అభ్యంతరం తెలపడంతో మార్కింగ్ మార్చారు. అనంతరం చంద్రుగొండ క్రాస్ రోడ్డు నుంచి 400 మీటర్ల దూరం డ్రెయినేజీ నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు మార్కింగ్ ఇవ్వగా వెంగన్నపాలెం ప్రజల వినతితో మళ్లీ మార్చారు. ఇంతలోనే మురుగునీరు వెంగన్నపాలెం చెరువులో కలపొద్దని స్థానికులు డిమాండ్ చేయగా పనులకు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత చంద్రుగొండ క్రాస్ వద్ద బస్‌షెల్టర్‌ను తొలగించే క్రమాన ఆటోడ్రైవర్లు అడ్డుపడగా ప్రజాప్రతినిధులు, అధికారులు నచ్చజెప్పారు. ఇలా ఏదో ఒక అవాంతరంతో పనులు నెమ్మదిగా సాగాయి.

అసంపూర్తిగానే పనులు

స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సాయిబాబా ఆలయం వరకు 1.9 కి.మీ. మేర డ్రెయినేజీలో 1.6 కి.మీ. పూర్తయింది. చంద్రుగొండ క్రాస్ నుంచి జూలూరుపాడు-చంద్రుగొండ బీటీ రోడ్డుకు ఇరువైపులా మాత్రం డ్రెయినేజీ చేపట్టారు. ఇంకా జూలూరుపాడు-చీపురుగూడెం మధ్య నాలుగు కి.మీ. మేర బీటీ రోడ్డుతో పాటు పాపకొల్లు క్రాస్ రోడ్ నుంచి 200 మీటర్ల డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు, డివైడర్ల ఆధునీకరణ జరగాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీ కావడంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షపు నీటిని డ్రెయినేజీల్లో మళ్లించకపోవడంతో రోడ్లపైనే నిలుస్తోంది. ఇకనైనా అధికారులు పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జూన్ ఆఖరి నాటికి పూర్తి


మండల కేంద్రంలో అభివృద్ధి పనులు జూన్ ఆఖరుకు పూర్తి చేస్తాం. సెంట్రల్ లైటింగ్ పనులు, గ్రిల్ పనులు జరుగుతున్నాయి. ఇవి మూడు వారాల్లో ఓ కొలిక్కి వస్తాయి. అసంపూర్తి డ్రెయినేజీలను కూడా త్వరగా పూర్తి చేయించడంపై దృష్టి సారించాం. అన్ని పనులను త్వరితగతిన పూర్తిచేస్తాం.
–లఖన్‌నాయక్, ఆర్‌అండ్‌బీ, జేఈఈ

డ్రెయినేజీల నుంచి దుర్వాసన


డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీల్లో చెత్త నిలవడంతో నీరు ముందుకు సాగడం లేదు. ఓపెన్ డ్రెయినేజీలు కావడంతో సమస్య మరింత తీవ్రంగా ఉంది. అంతేకాకుండా దోమలు విపరీతంగా పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇకనైనా డ్రెయినేజీ వ్యవస్థను సరిదిద్దాలి.
–బోగా నరసింహారావు, వ్యాపారి

నిర్మించినా ఫలితం లేదు


సైడ్ డ్రెయినేజీలు నిర్మించినా ఫలితం లేకుండా పోయింది. వర్షం వస్తే దుకాణాలు, ఇళ్ల ముందే నీరు నిలుస్తోంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటంతో తీవ్రమైన దుర్వాసన వస్తోంది. రోడ్డుపై నీరు నిల్వ ఉంకుండా డ్రెయినేజీలోకి మళ్లిస్తే ఈ సమస్య ఏర్పడేది కాదు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలి.
–పాదిలి రామారావు, వ్యాపారి

సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయాలి


డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండగా సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఆధునికీకరణ, గ్రిల్స్ ఏర్పాటు పనులు ఎక్కడికి అక్కడే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకున్న పాపానపోవట్లేదు. పరిస్థితి చూస్తే మరో ఏడాది వరకు కూడా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇకనైనా వేగం పెంచాలి.
–గాదె నాగరాజు, వెంగన్నపాలెం

గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

ఇల్లెందురూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఏప్రిల్ 28 నుంచి సమ్మె చేస్తున్న విషయం విదితమే. దీంతో క్షేత్రస్థాయిలో పరిపాలన కుంటుపడకూడదన్న భావనతో ఉన్నతాధికారులు తాత్కాలికంగా గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. మండలంలో బొజ్జాయిగూడెం, బోయితండా, చల్లసముద్రం, ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీలను పంచాయతీ కార్యదర్శి షర్మిలబేగంకు, మాణిక్యారం, మర్రిగూడెం గ్రామపంచాయతీలను పంచాయతీ కార్యదర్శి రజియాబేగంకు, సుభాష్‌నగర్, సుదిమళ్ల, కొమరారం, మామిడిగూడెం గ్రామ పంచాయతీలను పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్‌కు, కొమ్ముగూడెం, మిట్టపల్లి, రొంపేడు గ్రామపంచాయతీలను పంచాయతీ కార్యదర్శి మౌనికకు, రాఘబోయినగూడెం, సుదిమళ్ల, పూబెల్లి గ్రామ పంచాయతీలను పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు, పోలారం, పోచారంతండా గ్రామ పంచాయతీలను ఎంపీడీఓ బాలరాజుకు, రేపల్లెవాడ, మస్సివాగు, ముత్తారపుకట్ట గ్రామపంచాయతీలకు ఎంపీఓ చిరంజీవికి, తిలక్‌నగర్, విజయలక్ష్మినగర్, మొండితోగు గ్రామ పంచాయతీలను సీనియర్ అసిస్టెంట్ పార్వతికి, ఇందిరానగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీలను జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవికి, ధనియాలపాడు, లచ్చగూడెం, మామిడిగుండాల గ్రామ పంచాయతీలను టైపిస్టు వెంకటదుర్గాప్రసాద్‌కు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

టేకులపల్లి: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. బొమ్మనపల్లి, టేకులపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం ఓ వరం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పాత పాల్వంచలోని వనమా స్వగృహంలో కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ.30 కోట్ల వరకు లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, కోలాపూరి ధర్మరాజు, పరమేశ్, యాసిన్, రూప, ఎంఏ రజాక్, రావి రాంబాబు, యూసుఫ్, స్వామి, సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న నిమ్మల రాంబాబు

పాల్వంచరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కోరారు. మండలంలోని బంద్రుగొండ గ్రామంలో 20 రోజులుగా పొలాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పార్టీ జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసి దెబ్బతిన్నదని, అయినా అధికారులు ఇంకా కొనుగోలు చేయడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని బంద్రుగొండ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కంటే శ్రీను, నెల్లెల రమణయ్య, నిమ్మల నాగేంద్రబాబు, నెల్లల మల్లికార్జున్ రావు, ఇట్టి వెంకటేశ్వర్లు, కొలిపాక సూరిబాబు, మర్రి రమేశ్, పెద్ద వెంకటేశ్వర్లు, కంటే రాములు, ఎలగందుల గొవర్ధన్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్


సమ్మె నోటీస్ ఇస్తున్న జీపీ కార్మికులు

జూలూరుపాడు: తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నామని గ్రామపంచాయతీ కార్మికులు తెలిపారు. బుధవారం వారు ఎంపీడీఓ వెంకటేశ్వరరావును కలిసి సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా వీరు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ విధానం నుంచి మినహాయించాలని, అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉబ్బనపల్లి నరేశ్, సిరికొండ నరసింహారావు, తంబర్ల లక్ష్మి, రాము, మల్కం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేశాక నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ.వెయ్యి పెంచుతున్నట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ప్రజా ప్రతినిధులు, కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సీఎంతో పాటు మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కొలపూరి ధర్మరాజు, సత్యభామ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి లేక యువత ఇక్కట్లు


జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఉపాధి అవకాశాలు లేక యువత ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుల్‌మీరా అన్నారు. కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించగా నాగుల్ మీరా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ, నిరుద్యోగులకు భృతి చెల్లిస్తానన్న బీఆర్ఎస్ నేతలు మాట తప్పారని ఆరోపించారు. నాయకులు బోయినపల్లి విజయ్‌కుమార్, భూపేశ్, ఖయ్యూం, అజీజ్, రూపేశ్, రసూల్, చింటు, పవన్, సంతోష్, రణధీర్, రాహుల్, చిరంజీవి పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బారి నుంచి రక్షించాలి..

సింగరేణి(కొత్తగూడెం): రామవరం ప్రజలను కుక్కలు, కోతుల బారి నుంచి రక్షించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మున్సిపల్ కమిషనర్ రఘుకు బుధవారం వినతిపత్రం అందించారు. రామవరం ప్రాంతంలో కోతులు, కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయని, అయినా అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫహీమ్, ఖయ్యూం, రసూల్, రాహుల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పాల్వంచరూరల్: ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏపీఓ రంగాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నిమ్మల రాంబాబు, వేల్పుల రమేశ్, నీలం భాస్కర్, తాటి నాగరాజు, రామ్, శ్రీను, వి.పద్మ, కుంజా రమేశ్, తాటి వెంకటేశ్వర్లు, ఇనుముల వెంకటేశ్వర్లు, వెంకయ్య, కనకతార, పుల్లయ్య, గోవిందమ్మ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్, టాయిలెట్లు నిర్మించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మండల కేంద్రంలో బస్‌షెల్టర్, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని కోరుతూ డీఆర్ఓ అశోక్‌చక్రవర్తికి సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్‌రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. జూలూరుపాడులో బస్ షెల్టర్, పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో హర్యానాయక్, సురేశ్‌నాయక్, శ్రీను, భద్రు, లచ్చు నాయక్, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సముదాయంలో బుధవారం వైభవంగా పంచముఖ అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ యడవల్లి కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భారీగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కొత్వాల శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, పెద్దోజు నరసింహాచారి, బండారు అనంతాచారి, శ్రీనివాసాచారి, కాపర్తి వెంకటాచారి, మల్లెల శ్రీరాంమూర్తి, కందుకూరి రాము, దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని నీరు రాక ప్రజల ఇబ్బందులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలో కిన్నెరసాని నీళ్ల రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాయల శాంతయ్య, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి మల్లికార్జున్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ రోజు కిన్నెరసాని నీళ్ల రాకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజల కోసం ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, అరలక కర్ణాకర్, కొప్పుల రమేశ్, వెలెటి వెంకటేశ్వర్లు, శగగ లక్ష్మణ్, భూక్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి..


సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

ఇల్లెందురూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కుంజ కృష్ణ కోరారు. బుధవారం జేపీఎస్‌ల దీక్ష శిబిరాన్ని సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కుంజ కృష్ణ మాట్లాడుతూ.. విధుల్లో చేరిన మూడేళ్లకు క్రమబద్ధీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ తరువాత నాలుగేళ్లకు పెంచిందని, ప్రస్తుతం ఆ గడువు కూడా పూర్తయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మె బాట పట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు, వాంకుడోత్ శ్రీను, వాంకుడోత్ సరోజిని, రజిత, మాడె సునీత తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు న్యాయం చేయాలి

చుంచుపల్లి: తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సమ్మెకు దిగిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల విషయంలో ప్రభుత్వం న్యాయం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. బుధవారం 6వ రోజు జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. జేపీఎస్‌లకు బీఎస్పీ అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జునరావు, శరత్, నిరంజన్ కుమార్, ప్రవీణ్, సునీల్ పాల్గొన్నారు.

చర్చి ఎదుట గద్దెలు తొలగించాలి


మాట్లాడుతున్న పాస్టర్ విల్సన్

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లిలో చర్చి ఎదుట ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ గద్దెలను తొలగించి మతసామరస్యాన్ని కాపాడాలని పాస్టర్స్ జేఏసీ అధ్యక్షుడు ఎం.విల్సన్ కోరారు. లక్ష్మీదేవిపల్లిలోని చర్చిని పాస్టర్స్ జేఏసీ బాధ్యులు మంగళవారం పరిశీలించి మాట్లాడారు. అన్ని అనుమతులతో చర్చి నిర్మించినందున అధికారులు స్పందించి గద్దెలను తీయించాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ నాయకులు పాల్, యోనా యోబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?



మండల కేంద్రంలోని ‘ఏ’ కాలనీతండా నుంచి దుబ్బతండా మధ్యలో పంట పొలాల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తీగలు కిందకు వేలాడుతుండడంతో గాలిదుమారానికి తెగి పడితే రైతులు, పశువులకు ప్రమాదం వాటిల్లే అవకాశముంది. విద్యుత్ శాఖాధికారులు స్పందించి తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.
–టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : పీబీ కన్నయ్య, ఏఈ, బొమ్మనపల్లి సబ్‌స్టేషన్
సెల్ నంబర్ : 93923 88292